క్లుప్తంగా

రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

కృష్ణా: మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని రెండు రోజుల్లో ప్రారంభిస్తామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఐకేపీ ఏపీఎం బస్వరాజ్ తెలిపారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 'సాక్షి'లో శుక్రవారం 'కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు' అనే శీర్షికతో వచ్చిన వార్తకు స్పందించిన జిల్లా అధికారులు తక్షణమే మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని తమకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సమయం ఇస్తే శనివారం ప్రారంభిస్తామని, లేదా ఆదివారమైన కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తామని తెలిపారు. మండల రైతులు వరి ధాన్యం విక్రయించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

రైతులకు సబ్సిడీలో పరికరాలు

మాగనూర్: సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకానిజం 2024–25లో భాగంగా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు సరఫరా చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి పోలప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అన్ని వర్గాల మహిళా రైతులకు మాత్రమే లబ్ధి పొందుటకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళా, చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీ ఉంటుందని, పెద్దకారు రైతులకు 40 శాతం సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. వ్యవసాయం చేస్తూ, ఇప్పటి వరకు యాంత్రీకరణలో లబ్ధి పొంది మహిళా రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలో బ్యాటరీ, చేతి పంపులు, పవర్ ఆపరేటడ్ స్ప్రెయర్ బ్రష్ కటర్, కల్టివేటర్ , కేజీవిల్స్, ప్లావ్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులు మాగనూర్ రైతువేదిక దగ్గర ఇవ్వాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

కల్యాణ మండప నిర్మాణానికి విరాళం

మాగనూర్: మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం కల్యాణ మండపం నిర్మాణానికి మాగనూర్ గ్రామానికి చెందిన కంసాలి బ్రహ్మయ్యచారి తనయుడు వెంటేష్‌చారి రూ.51,116 వేలను విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు వాకిటి వాబయ్య తెలిపారు. విరాళాన్ని కల్యాణ మండపం నిర్మాణానికి వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆలంకుట ఆంజనేయులు, గడ్డం నరేష్ పాల్గొన్నారు.

గున్ముక్ల సబ్‌స్టేషన్‌కు ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్

ధన్వాడ: మండలంలోని గున్ముక్ల సబ్‌స్టేషన్‌లో హెల్ప్‌లైన్ కోసం ప్రత్యేక నెంబర్‌ను ఏర్పాటు చేసిన్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. గున్ముక్ల సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే ఈ నెంబర్‌కు 9492857641 సంప్రదించాలని ఆయన తెలిపారు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

నారాయణపేట: వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, లేనిపక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ ఆంజనేయులు వాహనదారులకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా లో వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించడంతో ప్రమాదాలు నివారించవచ్చన్నారు. రాష్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపరాదని, హెల్మెట్, సీట్ బెల్ట్ ఉపయోగించాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయరాదన్నారు. వాహనాలు నడిపే సమయంలో కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడిపితే చాలా వరకు రోడ్డు ప్రమాదాలు నివారించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నారాయణపేట రూరల్: మండలంలోని బొమ్మన్‌పాడు పీఎస్ పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాగ్యరాజ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, శంకర్, వెంకట్ రాములు, నేహ పాల్గొన్నారు.



సాగునీటి కోసం భగీరథ యత్నం



మరికల్‌లో పంటల కోసం బోరు డ్రిలింగ్ చేయిస్తున్న రైతులు

- అడుగంటిన భూగర్భ జలం
- పంటల కోసం కొత్త బోర్లు వేస్తున్న రైతులు
- ప్రశ్నార్థకంగా కోయిల్‌సాగర్ ఆయకట్టు



పల్లెగడ్డలో గొర్రెలకు వదిలిన వరిపంట

మరికల్: యాసంగి పంటలు కాపాడుకునేందుకు రైతులు అష్ట, కష్టాలు పడుతున్నారు. వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు కొత్త బోర్లు డ్రిలింగ్ చేస్తున్నా ఆశించిన మేరా నీళ్లు పడటం లేదు. దీంతో చేసేది లేక కొందరు రైతులు పంటలను పశువుల మేతకు వదిలేస్తున్నారు. ఎలాగైనా పంటలు కాపాడుకోవాలనే తపనతో కొందరు రైతులు పొలాల్లో బోర్లు డ్రిలింగ్ చేస్తూ అపర భగీరథ ప్రయత్నం చేస్తున్నారు.

మండలంలో ఇది పరిస్థితి..

యాసంగిలో కోయిల్‌సాగర్ ఆయకట్టు కుడి కాల్వ కింద 10 వేల ఎకరాలు, వ్యవసాయ బోర్ల కింద 23 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఆముదం 63 ఎకరాల్లో, కూరగాయల తోటలు 18 ఎకరాల్లో సాగు చేశారు. ఫిబ్రవరి చివరి నుంచి ఎండలు ముందుతున్న కొద్దీ వ్యవసాయ బోర్లలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. ఎండలు ముదిరిపోవడంతో పంటలకు నీరు అందక ఇప్పటికే వందల ఎకరాల్లో పంటలు ఎండిపోయి పశువులకు వదిలేశారు. కొందరు ట్యాంకర్లతో నీటి తడులు అందిస్తూ పంటలు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరికొందరు రైతులు పక్క రైతుల బోర్ల నుంచి నీళ్లకు అద్దె చెల్లించి పంటలు కాపాడుకుంటున్నారు. పంటలు చేతికి రావడానికి మరో 25 రోజుల సమయం పడుతుంది. అంతవరకు నీళ్ల కోసం తిప్పలు పడాల్సిందే.

కోయిల్‌సాగర్ రైతుల ఆందోళన..

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పరిధిలో రెండోపంట కింద ధన్వాడ, మరికల్ మండలాల పరిధిలోని కుడి కాల్వ కింద సుమారు 10 వేల ఎకరాలు, దేవరకద్ర మండలం పరిధిలో ఎడమ కాల్వ కింద 7 వేల ఎకరాల వరకు వరి సాగు చేశారు. సాగుకు ముందు నిర్వహించిన సమావేశంలో అధికారులు రెండు కాల్వలకు కలిపి ఐదు విడతలుగా నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. ప్రతి తడికి 10 రోజుల పాటు నీటిని వదలాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగా 3 తడులు సాఫీగా సాగింది. ఎండల ప్రభావంతో ఉష్ణోగ్రతలు రోజు, రోజుకు పెరగడం వల్ల 4వ తడిని మాత్రం కేవలం నాలుగు రోజులు మాత్రమే వదిలి నిలిపేశారు. దీంతో తీలేర్, వెంకటాపూర్ గ్రామాల్లోని పొలాలకు నీరు రాలేదు. మరో నెల రోజుల పాటు నీరు అందిస్తే తప్ప పంటలు చేతికొచ్చే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో 20 అడుగుల మేరకు నీరు నిల్వ ఉంది.

మూడు బోర్లు వేసినా చుక్కనీరు రాలేదు



నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను. ఎండలు పెరగడంతో బోరులో నీటిమట్టం పడిపోయి పంటకు నీరందడం కష్టంగా మారింది. పొలంలో మూడు బోర్లు డ్రిలింగ్ చేసినా ఒక్కొక్క బోరు రెండు వందల ఫీట్లు లోతు వేసినా చుక్కనీరు రాకపోగా, రూ.లక్ష నష్టం వచ్చింది, ఎండిన రెండు ఎకరాల వరిపంటను పశువులకు వదిలేశాను.

– గుర్రాల శ్రీనివాస్, పల్లెగడ్డ

బోరు డ్రిల్ చేసినా లాభంలేదు ..



మాకు ఉన్న నాలుగు బోర్ల ఆధారంతో ఐదు మంది సోదరులం కలిసి 14 ఎకరాల్లో వరి పంట సాగు చేశాం. ప్రస్తుతం ఎండలకు బోర్లలో నీటిమట్టం పడిపోవడంతో 300 ఫీట్లలోతు కొత్త బోరు డ్రిలింగ్ చేస్తే కేవలం కొద్దిపాటి నీరు మాత్రమే వచ్చింది. దీంతో పాత బోర్లకే పైపులు పెట్టి మడి, మడి తడుపుతూ పంటలను రక్షించుకుంటున్నాం.

– బోయ రాములు, మరికల్

మైనార్టీ సంఘాల శాంతియుత ర్యాలీ



నేరడగంలో శాంతియుత ర్యాలీ తీస్తున్న మైనార్టీ సంఘం నాయకులు

మాగనూర్: ముస్లిం పర్సనల్ లా బోర్డు నేతృత్వంలో శుక్రవారం మండలంలోని నేరడగంలో మైనార్టీ సంఘాల శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మైనార్టీల హక్కులకు విగాతం కలిగించే వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మైనార్టీ సంఘం నాయకులు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు బిల్లు ముస్లింలకు మాత్రమే కాకుండా ఇతర మైనార్టీ వర్గాలను కూడా ప్రభావితం చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ సంఘం సభ్యులు ఖలీల్ అహ్మద్, మొల్ల మైబు, జమీల్ అహ్మద్, బాషా, మౌలాలి, హాజు, అకీల్, మైను తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రుణాలు సద్వినియోగం చేసుకోండి



కోస్గిలోని సొసైటీలో మాట్లాడుతున్న జిల్లా మానిటరింగ్ అధికారి రాములు

కోస్గిరూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం నందు అందించే దీర్ఘకాలిక రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షులు భీంరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా కోస్గి పీఏసీఎస్ కార్యాలయం నుంచి దీర్ఘకాలిక రుణాలు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వ పరంగా అనుమతి పొందామన్నారు. రైతులు దీర్ఘకాలిక రుణాలు పొంది సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. జిల్లా మానిటరింగ్ అధికారి రాములు, కార్యదర్శి ఆంజిలయ్యగౌడ్, వైస్ చైర్మన్ వేణుగోపాల్, సంఘం సభ్యులు ఉన్నారు.

దేశ సేవలో ఆర్మీ ఉన్నతమైనది



గోపాలకృష్ణ, శ్రీకాంత్‌లను సన్మానిస్తున్న నాయకులు



ఆర్మీకి ఎంపికైన ఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన రమేష్‌ను సన్మానిస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు

కోస్గి: దేశభక్తితో దేశంకోసం ప్రాణాలర్పించే ఆర్మీ, నేవీ అత్యున్నతమైనవని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాము అన్నారు. శుక్రవారం మండలంలోని హన్మన్‌పల్లి గ్రామానికి చెందిన గోపాలకృష్ణ, శ్రీకాంత్ ఆర్మీ, నేవీలో ఉద్యోగం సాధించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా పలువురు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారిని ఆదర్శంగా తీసుకోని ఉన్నత విద్యను అభ్యసించి మంచి పదవులు అదిరోహించాలని కోరారు. కార్యక్రమంలో రాజు, మోహన్, చంటి, శివ, శశి, మహేష్, తదితరులు ఉన్నారు.

కృష్ణా: మండలంలోని ఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన రమేష్ అగ్నివీర్(ఆర్మీ)కి ఎంపికకావడంతో శుక్రవారం బీజేపీ నాయకులు యువకుడిని, వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో కృష్ణయ్య, కుర్వ రాజు, శ్రీనివాసులు, బాల్‌రాజ్, చంద్రశేఖర్, ఆంజనేయులు, తాయప్ప పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్ గ్రామానికి చెందిన మైబూబ్‌అలీ కుమారుడు ఎండీ హిమాన్‌పాషా భారతదేశానికి సైనిక సేవలు అందించేందుకు అగ్నివీర్‌కు ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. యువకుడు అగ్నివీర్‌కు ఎంపిక కావడంపై శుక్రవారం ధర్మజాగరణ కమిటీ నాయకులు నర్సింహ, కృష్ణయ్య, రాఘవేంద్ర, మహేందర్‌లు హిమాన్ పాషాను, వారి తల్లిదండ్రులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

పదెకరాల్లో ఎండిన వరిపంట



ఎండిన వరి పంటను పశువులకు మేతకు వదిలేశారు

ధన్వాడ: రెండు బోర్లు ఉన్నాయి, పంట మంచిగా పండుతుందని 10 ఎకరాలు కౌలుకు తీసుకోని వరిపంట వేశాడు మండలంలోని మనిపూర్‌తండాకు చెందిన టికరామ్‌నాయక్. కానీ ఇప్పుడు రెండు బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో సొంత డబ్బుతో ఇంకో బోరు వేయించాడు, కానీ అదికూడా నీళ్లు పడక పోవడంతో కళ్లముందే 10 ఎకరాల వరిపంట పూర్తిగా ఎండిపోవడంతో కౌలు రైతు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాడు. ముందే కౌలు ఎకరాకు రూ.10వేల చొప్పున రూ.1లక్ష యజమానికి చెల్లించాడు. వరి పంట వేసేందుకు రూ.2.60 లక్షలు ఖర్చు చేశారు. బోరు వేసేందుకు మారో రూ.1లక్ష వెచ్చించాడు. ఇప్పుడు అప్పులు పెరిగి, నష్టపోయి రోడ్డున పడ్డాడు. పంటను పశువుల మేతకు వదిలేశాడు. కౌల్ రైతు కావడంతో ప్రభుత్వం నుంచి తనను ఆదుకోవాలని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నాడు.

బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి కాగితాలకే పరిమితం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మక్తల్: బీఆర్‌ఎస్ హయాంలో కాగితాల వరకే అభివృద్ధి పరిమితమైందని మక్తల్ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మక్తల్‌లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మాగనూర్‌లో మధ్యాహ్న భోజనం విషయంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి కారణమన్నారు. మాగనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ ఘనటనపై ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఫుడ్ పాయిజన్ జరిగినప్పుడు వంట ఏజెన్సీలపై చర్యలు ఎందుకు తీసుకోలేదన్నారు. 20 ఏళ్లలో జరగని అభివృద్ధి శ్రీహరి ఎమ్మెల్యేగా గెలిచి 14 నెలలకే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. మక్తల్‌లో 150 పడకల ఆస్పత్రి, నర్వలో జూనియర్ కాలేజీ, డయాలసిస్ సెంటర్, ఆర్‌ఓ ప్లాంట్ మంజూరు చేయించినట్లు తెలిపారు. సంగంబండ బాధితులకు రూ.14 కోట్లు అందజేయడం జరిగిందన్నారు. ఈ ఘనత ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికే దక్కిందన్నారు. ఎమ్మెల్యే శ్రీహరిని మాజీ ఎమ్మెల్యే విమర్శించడం సరి కాదన్నారు. కార్యక్రమంలో మక్తల్ మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ కట్ట సురేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికుమార్, మార్కెట్ డైరెక్టర్లు శ్రీనివాసులు పయాజ్, మాగనూర్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గందె ఓం ప్రకాశ్



కోస్గి రూరల్: కోస్గి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా రెండో సారి గందె ఓం ప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారి వీఎస్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం కోర్టు ఆవరణలో పలువురు న్యాయవాదులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రధాన కార్యదర్శి శకనప్ప, కార్యదర్శి రాజలింగం, కోశాధికారి రాజురెడ్డి, స్పోర్ట్స్ తాజ్‌ఖాన్, సంతోష్, గ్రంథాలయం భీమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందిస్తా



బొప్పలి వెంకటేష్ యాదవ్‌ను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

కోస్గి: జాతీయ యాదవ కుల పోరాట సమితి సంఘ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొప్పలి వెంకటేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శిరిడి సాయిబాబా ఆలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని తోగాపూర్ గ్రామానికి చెందిన బొప్పలి వెంకటేష్ యాదవ్ జాతీయ యాదవ కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎంపిక కావడం హర్షనీయమని జిల్లా అధ్యక్షుడు గొల్ల నర్సింహులు అన్నారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పిరంపల్లి శ్రీనివాస్ యాదవ్, మండల అధ్యక్షులు రమేష్ యాదవ్, సంఘం నాయకులు ముష్టి భాస్కర్, హన్మంతు, వెంకట్రాములు, మైపాల్, కొండప్ప, రమేష్, శ్రీనివాస్, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

బావోజీ జాతర పోస్టర్ ఆవిష్కరించిన సీఎం



కొత్తపల్లి: మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో వెలసిన గిరిజన ఆరాధ్య దైవం గురులోకా మసంద్ బావోజీ జాతర మహోత్సవాల వాల్‌పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. వచ్చే నెల 11వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు హాజరు కావాలని సీఎంను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గోపాల్ నాయక్, పాలమూర్ విశ్వవిద్యాలయ మాజీ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్, మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు నర్సింహులు, నిడ్జింత తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి, సుభాష్ నాయక్, రవి, రాజేష్, అనిల్‌నాయక్, రాగ్యానాయక్ పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి పెద్దపీట



నర్వ పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సీఈఓ, చైర్మన్

నర్వ: రైతుల అభ్యున్నతికి పీఏసీఎస్ పెద్దపీట వేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్నలు అన్నారు. శుక్రవారం నర్వ పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 2025–26 వార్షిక ప్రతిపాదిత బడ్జెట్‌ను రైతుల సమక్షంలో నివేదికను సీఈఓ ఉదయ్ చదివి వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.1.50కోట్లతో రైస్ మిల్లును నిర్మాణం చేయాలని, రూ.50 లక్షలు పీఏసీఎస్ ద్వారా, మరో రూ.50 డీసీసీబీ లోన్ ద్వారా రూ.1 కోటితో రైతులకు గోల్డ్‌లోన్ అందించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. రైతులకు కొత్తలోన్స్, ఎరువులు, క్రిమి సంహారక మందులు అందించాలని తీర్మానం చేశామన్నారు. సమావేశంలో పీఏసీఎస్ పాలకవర్గం డైరెక్టర్లు రామేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాములు నాయక్, వెంకటన్న, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కాళికాదేవి ఉత్సవాలు ప్రారంభం

ఊట్కూరు: మండల కేంద్రంలోని దేవీనగర్‌లో వెలసిన కాళికాదేవి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని పూజారి మల్లమ్మ శుక్రవారం తెలిపారు. శనివారం గంగపూజ, కలశ, పల్లకీ ఊరేగింపు, ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం దీపోత్సవం, మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, రాత్రి రెట్టపట్ల కార్యక్రమం, బుధవారం అమ్మవారి పల్లకీ సేవ, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

మండల అభివృద్ధికి సహకరించండి



కొత్తపల్లి మండల అభివృద్ధికి కృషి చేయాలని సీఎంకు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తపల్లి: కొడంగల్ నియోజక వర్గంలోని కొత్తపల్లి మండలాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో మండల కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్, బీసీ గురుకులం, ధాన్యం గోదాం, 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు నర్సింహ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

⇨ ఉమ్మడి మద్దూరు మండలం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో ఉమ్మడి మద్దూరు మండల కాంగ్రెస్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. సీఎంను కలిసి వారిలో పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

నారాయణపేట రూరల్: సమ సమాజ స్థాపన ఆర్ ఎస్ ఎస్ లక్ష్యమని విభాగ్ సేవా ప్రముక్ శివశంకర్ జీ అన్నారు. శుక్రవారం మండలంలోని కొల్లంపల్లి గ్రామంలో ఆర్ ఎస్ ఎస్ అధ్వర్యంలో ఉప మండల వార్షికోత్సవ ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ ఎస్ ఎస్, వీ హెచ్ పి, ఏ బి వి పి, భజరంగ్ దళ్ సంఘ నాయకులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో ఉగాది వేడుకలు

మరికల్: మండల కేంద్రంలో విద్యార్థులు ఘనంగా ముందుగానే ఉగాది వేడుకలు నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం ఉగాది పచ్చడి తయారు చేసి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంజాబ్ రైతులపై దాడి అమానుషం

నారాయణ పేట టౌన్: హర్యానా సమీపంలోని ఖనౌరి, శంబు సరిహద్దులో ఆందోళన చేస్తున్న రైతుల గుడారాలు, వేదికలను పోలీసులు కూల్చివేయడం, పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్ ఆదేశాలతో పోలీలు 650 మంది రైతు నాయకులను అరెస్ట్ చేసి జైలులో పెట్టడం దుర్మార్గమైన చర్య అని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు అన్నారు. పంజాబ్ ప్రభుత్వ చర్యను నిరసిస్తూ శుక్రవారం నారాయణపేట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పలువురు వామ పక్ష నాయకులతో కలిసి సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్ కే ఎం)ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.యాదగిరి, కొండ నర్సింహులు, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.వెంకట్రామిరెడ్డి, సీపీ ఐ ఎంల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

దామరగిద్ద: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇసుక టిప్పర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాజు వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమతి లేని టిప్పర్‌ను గుర్తించారు. టిప్పర్ డ్రైవర్ వెంకటేష్, ఓనర్ రమేష్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వరి పంటల పరిశీలన

మాగనూర్: మండలంలోని వడ్వాట్, మాగనూర్ గ్రామాలలో కొన్ని రోజులుగా వరి పంటల మార్పులపై ఆయా గ్రామాలకు చెందిన జైపాల్‌రెడ్డి, వర్కూర్ రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్ అనే రైతులు ఆందోళన చెందుతూ స్థానిక మండల వ్యవసాయ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో స్పందించిన వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలను పిలిపించినట్లు మండల ఏఓ పోలప్ప తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ భూషణ్‌రావు, డాక్టర్ వీ దివ్యరాణి సంబంధిత రైతుల పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరి పంటలో వస్తున్న మార్పులను వారు గమణించామన్నారు. వరి పంటలో ఏర్పడిన సమస్యలను రైతులు శాస్త్రవేత్తల దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం విత్తనాల లోపంతో ఈ సమస్య ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధ్యయనం చేసి త్వరలోనే సమస్యను గుర్తిస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని శాస్త్రవేత్తలు సూచించారు. ఏడీఏ నాగేష్‌కుమార్‌రెడ్డి, ఏఈఓ పవన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర చట్టం తీసుకురావాలి

ధన్వాడ: హమాలీ కూలీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చట్టం తీసుకురావాలని, బోర్డులో పేరు నమోదు చేయించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో హమాలీ కూలీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో భాను, బాలస్వామి, కతలప్ప, బాల నరసింహులు ఉన్నారు.